నిర్మించారు.. మరిచారు..!

- నిరుపయోగంగా 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు
- రూ.2.80కోట్లతో నాలుగేళ్ల క్రితం నిర్మాణం
- యాసంగి సీజన్‌కైనా ఉపయోగంలోకి వచ్చేలా చూడాలని కోరుతున్న రైతులు



చిలుకూరు పలుకుబోడులో ఏర్పాటు చేసిన గోదాములు

చిలుకూరు : మండల కేంద్రం పరిధిలోని పలుకుబోడులో కోట్ల రూపాయలతో నిర్మించిన గోదాములు నిరుపయోగంగా మారాయి. ఈ సీజన్‌లైనా వినియోగంలోకి తెస్తారనుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. నిర్మాణాలు పూర్తై నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారు. రైతులు పండించిన పంటను ఆరబెట్టుకోవడంతో పాటు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ ఉంచుకునేందుకు వీలుగా అప్పట్లో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి రూ.2.80కోట్లు వెచ్చించి భారీ షెడ్లతో 5వేల మెట్రిక్ టన్నులు సామర్థ్యం గల గోదాములను నిర్మించారు. గోదాములు నిర్మించిన రెండేళ్ల వరకు దారి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్నాయి. అనంతరం రోడ్డు ఏర్పాటు చేసి అప్పటి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేతుల మీదుగా గోదాములను ప్రారంభించారు. ప్రారంభించి కూడా రెండేళ్లు కావస్తున్నా నేటికీ వినియోగంలోకి రావడం లేదు. ఈ గోదాము నిర్మాణం చేపట్టడంతో చుట్టు పక్కల ప్రాంతాల రైతులకు ధాన్యం, ఇతర పంటను భద్రపర్చుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఈ అవసరాలను గుర్తించి మండల పరిధిలోని పలుకుబోడు గుట్టల ప్రాంత్రంలో వృథాగా ఉన్న భూమిని చదును చేసి నిర్మాణం చేపట్టారు. ఈ భూమికి చుట్టూ పొలాలు ఉండడంతో రైతులకు ఇబ్బందులు లేకుండా బేతవోలు రోడ్డు నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులతో మాట్లాడి రోడ్డు సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు.

ఆరునెలల పాటు ఉచితంగా ధాన్యాన్ని భద్రపర్చుకోవచ్చు..

రైతులు పండించిన ధాన్యాన్నికి మద్దతు ధర వచ్చే వరకు దాచుకోవాలంటే బయటి గోదాములకు నెలకు బస్తాకు రూ.5నుంచి 6 చెల్లించాల్సి ఉంటుంది. దీంతో రైతులు కిరాయిలు చెల్లించలేక ధాన్యాన్ని, ఇతర పంటలను తక్కువ ధరకే కల్లాల వద్దనే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో రైతులు ఆర్థికంగా దెబ్బతింటున్నారు. పలుకుబోడులో నిర్మించిన గోదాములు వినియోగంలోకి తీసుకువస్తే రైతులకు ఆరు నెలల పాటు ఉచితంగా ధాన్యాన్ని, ఇతర పంటలను దాచుకునే వీలుంటుంది. అనంతరం నిబంధనల ప్రకారం కొంత మేర డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ గోదాముల నిర్మాణం అనంతరం దారి సమస్య ఉండడంతో స్థానిక రైతులతో మాట్లాడిన అధికారులు బేతవోలు రోడ్డు నుంచి దారి ఏర్పాటు చేశారు. బేతవోలు రోడ్డు నుంచి కొంత దూరం దేవాలయ భూమి, ఆ తర్వాత కొద్దిగా రైతుల పట్టా భూమి ఉంది. అయితే సదరు రైతులతో మాట్లాడి దారిని పకడ్బందీగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి దారి సమస్య కూడా లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు మేలు జరిగే ఈ గోదాములకు కనీసం వచ్చే సీజన్‌లోనైనా వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

చరిత్ర ప్రతి మలుపులో గమ్యం కమ్యూనిజమే



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : చరిత్ర ప్రతి మలుపులో గమ్యం కమ్యూనిజమేనని, దేశంలో కమ్యూనిజ భావజాలంతో ఆవిర్భంచిన తొలి రాజకీయ పార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించిన నాటి నుంచి పేద ప్రజల, నిమ్నవర్గాల సమస్యలపై వివిధ రూపాలతో పోరాడుతున్న ఏకై క పార్టీ అన్నారు. కమ్యూనిజం ఒక నిజం లాంటిదని దానికి మరణం ఉండదన్నారు. ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు పలువురు ప్రముఖ నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు

మేళ్లచెరువు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అవమానకరంగా మాట్లాడిన కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మెయిన్‌రోడ్డుపై ఆదివారం నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. కులాలు, మతాల మధ్య మత ఘర్షణలు పెట్టి ఐక్యంగా ఉన్న దేశంలో రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ చూస్తుందని విమర్శించారు. ఇలాంటి చర్యలను ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గుండు సైదులు, ఆదినారాయణ, నర్సింహరావు, లక్ష్మీనారాయణ, బజ్జూర్, మల్లయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు క్రిస్మస్ ప్రేమ విందు

హుజూర్‌నగర్ : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో సోమవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రేమవిందు ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని క్రైస్తవులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్రిస్మస్‌కు చర్చీలు ముస్తాబు



దిర్శించర్లలో విద్యుత్‌కాంతులతో ముస్తాబు చేసిన చర్చి

నేరేడుచర్ల : మండలంతో పాటు పట్టణంలోని చర్చీలు ఈ నెల 25న జరగనున్న క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. మండలంలోని దిర్శించర్లలోని ఉప్పలదేవి సెంటరనీ బాప్టిస్ట్ చర్చితో పాటు మండలంలోని సోమారం, మున్సిపాలిటీలోని రామాపురం, అన్ని గ్రామాల్లో చర్చీలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎడవెల్లి సర్వయ్య కోరారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయంలో అన్ని రకాల దినపత్రికలతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విప్లవకారుడు పెరియార్ ఆదర్శప్రాయుడు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్

చిలుకూరు : మండల కేంద్రంలో మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాంఘీక విప్లవకారుడు పెరియార్ రామస్వామి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ వికాస రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా భాస్కర్ మాట్లాడుతూ.. సాంఘీక విప్లవ కారుడు పెరియార్ ఆదర్శప్రాయుడని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవ వికాస వేదిక జిల్లా అధ్యక్షుడు పుట్టపాక అంజయ్య, నాయకులు పీవీ దుర్గాప్రసాద్, నరసింహారావు, గుజ్జుల నరసింహారెడ్డి, కై లాసం ఏడుకొండలు, ఖన్నంసాహెబ్, దొడ్డా వెంకటయ్య, గురుప్రసాద్, వీరబాబు, ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా



పొలాలలో బోల్తాపడిన కారు

హుజూర్‌నగర్ రూరల్ : అదుపుతప్పి ఓ కారు బోల్తా పడింది. ఈ ఘటన మండల పరిధిలోని వేపలసింగారం గ్రామశివారు మూలమలుపు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలంలోని నల్లబండగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ బాలురు మేళ్లచెరువు నుంచి హుజూర్‌నగర్ వైపు కారులో వస్తున్న క్రమంలో మిట్టగూడెం వద్ద మూలమలుపులో వేగంగా వచ్చిన కారు కల్వర్టును ఢీకొట్టి పక్కనే ఉన్న పొలాల్లో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు బాలురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వేలో పాల్గొన్న కౌన్సిలర్, నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలో మున్సిపల్ అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టారు. ఆదివారం పట్టణంలోని 19వ వార్డులో జరుగుతున్న సర్వేను కౌన్సిలర్ అట్లూరి మంజుల, కాంగ్రెస్ నాయకులు ఎండీ అజీజ్‌పాషా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డ్ ఎన్‌రోల్‌మెంట్ అధికారి నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు జక్కుల మల్లయ్య, యూసఫ్, నాగేశ్వరరావు, మోహిన్, గీత, అస్మా, సైదమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక సభలను విజయవంతం చేయాలి



హుజూర్‌నగర్ : మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర 6వ విద్యా, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.దామోదర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం ప్రాంతీయ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను స్థానికులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సారి నల్లగొండలో ఈనెల 28, 29, 30వతేదీల్లో నిర్వహిస్తున్నారని, మహాసభల్లో ప్రభుత్వ విద్యా రంగంపై మేధావుల ఆధ్వర్యంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సభలకు జిల్లాలోని ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు బీరెల్లి శ్రీనివాసరెడ్డి, మామిడి వెంకటేశ్వర్లు, జెట్టి కమల, చిక్కుళ్ల గోవిందు, రాజశేఖర్‌రెడ్డి, కిరణ్ బాబు, రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, జ్యోతి, స్రవంతి, శ్రీను, చంద్రశేఖర్, వీరాస్వామి, చిరంజీవి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, నర్సయ్య, నాగమణి, సైదులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావు, గడ్డం వెంకటస్వామికి ఘన నివాళులు



హుజూర్‌నగర్ : పీవీ రావు, గడ్డం వెంకటస్వామి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు, కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి వర్ధంతిని ఆదివారం పట్టణంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం పీవీరావు, గడ్డం వెంకటస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు డి.బాబురావు, నాయకులు ఐ.శీను, బెంజిమెన్, రాములు, జ్ఞానయ్య, సావిత్రి, పున్నయ్య, అరుణ్, రాజా, వినోద్, పున్నయ్య, నరసింహారావు, బాబు, అంబేద్కర్, రాము, ప్రవీణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు, కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి(కాకా), పీవీరావు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ సెంటర్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొట్టుముక్కల రాములు, అరుణ్, రాము, ప్రవీణ్, స్రవంతి, నరసయ్య, జనార్దన్, పెంటయ్య, సంధ్య, నర్సింహరావు, నవీన్, శ్రీనివాస్, అజయ్, లింగయ్య, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మున్సిపల్ కేంద్రంలో మాజీ ఎంపీ దివంగత జి.వెంకటస్వామి వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్‌చైర్మన్ అలక సరిత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్‌పీలు తదితరులున్నారు.



హుజూర్‌నగర్ రూరల్ : చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు



నేరేడుచర్ల : వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోదాడరూరల్ : పట్టణంలోని మాతృశ్రీ విద్యా నిలయం పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 25ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎర్రంశెట్టి ఆనంద కుమార్, కొల్లు రాజేష్, కలకొండ సైదులు, చీదేళ్ల వెంకటసాంబశివరావు, ఇరుగు శ్రీకాంత్, చల్లా శ్రీనివాస్, కుడుముల మధు తదితరులు ఉన్నారు.

బంగ్యానాయక్ మృతి పార్టీకి తీరనిలోటు

గరిడేపల్లి : మండలంలోని సోమ్లాతండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాణోతు బంగ్యానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మృతదేహాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్ సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బంగ్యానాయక్ మృతి పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరనిలోటని అన్నారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల, వెంకటరమణారెడ్డి, అంజయ్య, దస్తగిరి, వెంకటనారాయణ, జమ్మా, రవీందర్‌నాయక్, వెంకట్‌నాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



హుజూర్‌నగర్ రూరల్ : గోదాదేవి అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



హుజూర్‌నగర్ : మేళతాళాలు, కుంకుమతో ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏడో పాశుర తాత్పర్యం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా సుప్రభాతసేవ, ఆరాధన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య, ఈఓ లక్ష్మణరావు, ధర్మకర్తలు గంధం అంజయ్య, హరీష్‌కుమార్, కవిత, నరసింహారావు, కృష్ణప్రసాద్, అర్చకులు ముడుంబై హరీష్‌కుమారాచార్యులు, భక్తులు ఉన్నారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం ఏడో రోజు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రధాన పూజారి మొలుగు శ్రీనివాసాచార్యులు, వెంకటరమణశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోత్సవాలు నిర్వహించారు. స్వామివారికి అష్టోత్తరం, పుష్పాలంకరణ చేసి పూలు, పండ్లతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సేవాకాలం తిరుప్పావై పఠనం చేశారు. భక్తులు గోత్రనామాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో రాగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జగని సుకేష్, పులిజాల వెంకటరమణారావు, మురారిశెట్టి రమేష్, వెంకట్‌రెడ్డి, రాగిరెడ్డి రేవతి, జగిని లక్ష్మి, పద్మ తదితరులున్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీవిష్ణు సహస్రం, గోదా, రామానుజ అష్టోత్తరాలతో పూజలు చేశారు. అనంతరం లక్ష కుంకుమను దోసపాటి నరసింహామూర్తి, శోభారాణి ఇంటి నుంచి మేళతాళాలతో ఆలయానికి ఊరేగింపుగా చేర్చి కుంకుమార్చన చేశారు. అదే విధంగా క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి తమలపాకులతో సహస్రనామ పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, అర్చకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్లలోని శ్రీకోదండ రామాలయంలో ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పరిశ్రమ అభివృద్ధిలో కార్మికులది కీలకపాత్ర



పరిశ్రమ వివరాల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కంపెనీ ఎండీ, డైరెక్టర్లు

మఠంపల్లి : పరిశ్రమ అభివృద్ధిలో కార్మికులది కీలకపాత్ర అని ఎన్‌సీఎల్ ఎండీ కలిదిండి గౌతమ్ అన్నారు. మండలంలోని మట్టపల్లి నాగార్జున సిమెంట్ పరిశ్రమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిశ్రమ నాలుగు దశాబ్దాలుగా అభివృద్ధి చెందడంలో కార్మికులు కీలకపాత్ర పోషించారని అన్నారు. రాష్ట్రంలో ఏటా 190మిలియన్ టన్నులు సిమెంట్ ఉత్పత్తి అయితే వినియోగం 150మిలియన్ టన్నులన్నారు. ప్రస్తుతం సిమెంట్ పరిశ్రమలు కొన్ని ఒడిదొడుకులు ఉన్నప్పటికీ ప్రభుత్వ సహకారంతో ముందుకు వెళ్తున్నాయని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమ పరిధిలోని మట్టపల్లి, సుల్తాన్పూర్‌తండా, రామచంద్రపురం తండా తదితర గ్రామాలలో సామాజిక బాధ్యతలో భాగంగా పలు అభివృద్ధి పనులు, విద్యా, వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం 30ఏళ్లుగా పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కార్మికులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పరిశ్రమ డైరెక్టర్లు వి.గురాడియా, ఆర్.తిహాడ్, చంద్రశేఖర్, రఘువర్మ, కమలేష్, కంపెనీ అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాకూబ్

గరిడేపల్లి : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు యాకూబ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జీపీ కార్మికుల జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలలుగా జీపీ కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫాం అందజేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులరేజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలకృష్ణ, నాగరాజు, రామారావు, సైదులు, అంజిబాబు, శ్రీను, ముత్తయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ధ్యానం ఎంతో దోహదం



ధ్యానం చేయిస్తున్న ధ్యాన గురువు రామారావు

హుజూర్‌నగర్ : సంపూర్ణ ఆరోగ్యానికి ధ్యానం ఎంతో దోహదం చేస్తుందని, ప్రతిఒక్కరూ తన దినచర్యలో ధ్యానాన్ని ఒక భాగంగా చేసుకోవాలని ప్రిసెప్టర్ (ధ్యానగురువు) ముమ్మిడి రామారావు, శిక్షకులు బీసీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని బృందావనంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ధ్యానంపై శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ధ్యానం అన్ని సమస్యలకు చక్కటి పరిష్కారమన్నారు. కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రామస్వామి మాట్లాడారు. విద్యార్థులు గణితంలోని మెళకువలు తెలుసుకోవాలని, జీవితంలో ఉన్నతమైన స్థానానికి రామానుజన్ స్ఫూర్తితో ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి యూసుఫ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, పూర్ణచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, హాస్టల్ సిబ్బంది తదితరులున్నారు.

గోల్డ్‌మెడల్ అందుకున్న రంగిశెట్టి కావ్యశ్రీ



మేళ్లచెరువు: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రంగిశెట్టి సైదయ్య కుమార్తె కావ్యశ్రీ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల ఐసీబీఎం (స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెన్స్) నుంచి పీజీడీఎంలో 2022–24 బ్యాచ్ టాపర్‌గా నిలిచింది. ఈ మేరకు ఆదివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె గోల్డ్ మెడల్ అందుకుంది. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు కావ్యశ్రీని అభినందించారు.

మాలధారులకు అన్నదానం

కోదాడ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్ సమీపంలో ఉన్న అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు దాతల సాయంతో నిత్యన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రాంమ్మూర్తి తెలిపారు. ఆదివారం ఖమ్మం పట్టణానికి చెందిన దేవిశెట్టి శ్రీనివాసరావు– కృష్ణవేణి దంపతులు అన్నదానానికి రూ.9,116 విరాళం ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా నకిరేకల్‌కు చెందిన వీఎస్ఆర్ డైరీ నిర్వాహకుడు మారెళ్ల పుల్లారెడ్డి– నాగమణి దంపతులు అన్నదానం కార్యక్రమం నిర్వహించే 66రోజుల పాటు మాలధారులకు కావాల్సిన పెరుగును ఉచితంగా సరఫరా చేస్తున్నారని తెలిపారు.

కోదాడరూరల్ : పట్టణంలోని హుజూర్‌నగర్‌రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి చంద్రశేఖర్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. నిర్వాహకులు శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న పట్టణానికి చెందిన నాగరాజు ఇటీవల మృతి చెందారు. దీంతో అతడి కుటుంబానికి కోదాడ డివిజన్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం తరఫున ఆదివారం రూ.13వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సంఘం నాయకులు పి.వెంకన్న, కె.దుర్గారావు వి.బోసుబాబు, ఎం.నాగరాజు, రాము, సీతారాములు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల పరిధిలోని పానుగోడు గ్రామానికి చెందిన రామ్‌లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఎస్సీ కాలనీవాసులు ఆదివారం మృతురాలి కుటుంబానికి రూ.12వేలు, 25కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌సైదులు, మద్దిమడుగు సైదులు, నందిపాటి మధు, సైదులు, శ్రీను, నాగేంద్రబాబు, వెంకన్న, మధు, గుర్వయ్య, గురుస్వామి పాల్గొన్నారు.